క్లుప్తంగా

విద్యా సామగ్రి అందజేత



దొరవారిసత్రం: దొరవారిసత్రం బీసీ గురుకుల పాఠశాల, ఏకొల్లు జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థులకు శనివారం ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం పబ్లిక్ పరీక్షలకు అవసరమైన విద్యాసామగ్రిని అందజేశారు. ప్రిన్సిపాల్ తిరుపతయ్య, ఏటీపీ పరమేశ్వరరావు, ఎస్ఐ తిరుమలరావు, సంఘం నాయకులు కిరణ్‌కుమార్‌గౌడ్, వాసుకుమార్, జె.కిరణ్ పాల్గొన్నారు.

కుక్కల బెడదను మా దృష్టికి తీసుకురండి



గూడూరు: పట్టణంలో కుక్కల బెడద ఎక్కువగా ఉన్నట్లయితే తన దృష్టికి తీసుకురావాలని మున్సిపల్ కమిషనర్ సాయినాథ్ పేర్కొన్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో శనివారం రెండవ దఫాగా కుక్కలను పట్టే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ సాయినాథ్ ఆ ప్రాంతాల్లో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలోని పలు ప్రాంతాల్లో గతంలోనే కుక్కలను పట్టామన్నారు. అలాగే ప్రస్తుతం పట్టిన కుక్కలను కూడా తిరుపతికి తీసుకెళ్లి స్టెరిలైజేషన్ చేయిస్తున్నామని తెలిపారు.

ముత్యాలమ్మకు వెండి వస్తువుల వితరణ

చిల్లకూరు: తూర్పుకనుపూరులో వెలసియున్న ముత్యాలమ్మకు శనివారం దాతల సహకారంతో వెండి వస్తువులను వితరణగా అందజేశారు. ముత్యాలమ్మ అమ్మవారికి మొక్కులో భాగంగా దాతలు ఆలయ ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ వేమారెడ్డి మురళీమోహన్‌రెడ్డి చేతులమీదుగా అమ్మవారికి వెండి గంట, రెండు హారతులను దాతల ద్వారా (513 గ్రాములు) రూ.40 వేల విలువ చేసే వస్తువులను ఆలయ ఈఓ నవీన్‌కుమార్‌కు అందజేశారు.

మంచి వ్యక్తిని కోల్పోయాం



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కిలివేటి

నాయుడుపేటటౌన్: పార్టీ కోసం ఎంతో కష్టపడి పనిచేస్తూ మంచి నాయకత్వ లక్షణాలు కలిగిన వైఎస్సార్‌సీపీ నేత అల్లేకూల నరసయ్య మృతి చాలా బాధాకరమని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. పుదూరు గ్రామంలో నరసయ్య ఇంటికి శనివారం ఎమ్మెల్యే వెళ్లి అతని కుటుంబసభ్యులను పరామర్శించి వారికి భరోసా ఇచ్చారు.

రాపూరు విద్యార్థి ప్రతిభ



శ్రావణ్‌కుమార్

రాపూరు: రాపూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న గజ్జల శ్రావణ్‌కుమార్ సబ్ జూనియర్ జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు రమేష్ తెలిపారు. మార్చి 27న గువాహటి జరిగే సబ్ జూనియర్ బాలుర జాతీయ హ్యాండ్‌బాల్ పోటీల్లో నెల్లూరు జిల్లా తరఫున పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

గృహనిర్మాణాలు వేగవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ

గూడూరు: జగనన్న గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని గూడూరు ఆర్డీఓ కిరణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన తన కార్యాలయంలో గూడూరు మున్సిపల్ పరిధిలోని హౌసింగ్ అధికారులు, సెక్రటరీలు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది, కాంట్రాక్టర్లతో సమీక్ష నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ సాయినాథ్ పాల్గొన్నారు.

ఎట్టకేలకు తెరుచుకుంది...

గూడూరు: మూతపడ్డ రైల్వేగేటు ఎట్టకేలకు శనివారం నుంచి తెరుచుకుంది. దీంతో ఆ మార్గం గుండా వెళ్లే వాహన ఛోదకులకు ఇబ్బందులు తప్పాయి. చెన్నై రైల్వే గేటు నెల రోజులకుపైగా మూతపడింది. ఈ క్రమంలో ఐదు రోజుల క్రితం సాక్షిలో కథనం ప్రచురితం కావడంతో, మరమ్మతు పనులను వేగంవంతం చేసి ఎట్టకేలకు శనివారం నుంచి గేట్లు తీసేశారు. వాహన ఛోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బైక్ బోల్తా.. ఒకరికి గాయాలు

కోట: బైక్ బోల్తాపడి రిటైర్డ్ టీచర్ గాయపడ్డాడు. శనివారం రాత్రి వీరారెడ్డిసత్రం వద్ద చోటుచేసుకుంది. కొత్తపాళెం గ్రామానికి చెందిన రిటైర్డ్ టీచర్ శ్రీనివాసులురెడ్డి పని నిమిత్తం వీరారెడ్డిసత్రానికి బైక్‌పై వెళ్లి తిరిగి వస్తుండగా అదుపుతప్పి పడ్డాడు. గాయపడ్డ అతన్ని స్థానికులు మెరుగైన చికిత్స కోసం నెల్లూరుకు తరలించారు.

ఎండమావులను చూసి భ్రమించకండి

- 2024, 2029లోనూ వైఎస్సార్‌సీపీదే హవా
- సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య



రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

నాయుడుపేట: పట్టభద్రుల ఎమ్మెల్సీల గెలుపు ఎండమావులు లాంటివని వాటిని చూసి టీడీపీ నేతలు భ్రమిస్తున్నారని సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. శనివారం నాయుడుపేట గోమతి సర్కిల్ నుంచి స్వర్ణముఖి కాజ్‌వే వరకు రూ.5కోట్లతో ఏర్పాటు చేస్తున్న నాలుగు లేన్ల రహదారిని ఎమ్మెల్యే పరిశీలించి ఆర్అండ్‌బీ, ఏపీఐఐసీ అధికారులతో చర్చించారు. అలాగే లోతువానిగుంట వద్ద రహదారి అటుఇటుగా బాక్స్‌టైప్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు కేటాయించాలని మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశించారు. జనరల్ ఫండ్‌లో నిధులు వెచ్చించి అవసరమైన చోటు డ్రైనేజీ వ్యవస్థను కూడా రోడ్డుకు అనుసంధానం చేస్తూ సుందరంగా తీర్చిదిద్దాలని సూచించారు. అలాగే గాంధీమందిరం వద్దగల మున్సిపల్ పార్కును సందర్శించారు. ప్రజల సౌకర్యార్థం మరుగుదొడ్లు, వాచ్‌మెన్ గది, పిల్లలకు జారుడు బండవంటి పరికరాలను అమర్చేందుకు సిద్ధం చేయాలన్నారు. మున్సిపల్ అధికారులు మార్కింగ్ ఇచ్చి పనులు ప్రారంభించారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ నేత పొట్టపూడి రాజేష్‌ను పరామర్శించారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడారు. 2024లోనే కాదు 2029లో కూడా వైఎస్సార్‌సీపీ హవా కొనసాగిస్తుందని తెలిపారు. టీడీపీ నేతలు చంకలు గుద్దుకుంటున్నారని విమర్శించారు. ఎండమావులు చూసేందుకు మాత్రమే కనిపిస్తాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతారని పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, కాంట్రాక్టర్ శిరసనంబేటి చైతన్యక్రిష్ణారెడ్డి, చైర్‌పర్సన్ కటకం దీపిక, ఎంపీపీ కురుగుండ ధనలక్ష్మి, వైస్ చైర్మన్ జలదంకి వెంకటక్రిష్ణారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు తంబిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డి, రాష్ట్ర ట్రేడ్ యూనియన్ కార్యదర్శి కట్టా వెంకటరమణారెడ్డి, కామిరెడ్డి రాజారెడ్డి, ఓట్టూరు కిషోర్‌యాదవ్, గంధవల్లి సిద్దయ్య, జయరామయ్య, మల్లికార్జున్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, అనపల్లి లక్ష్మయ్య, కౌన్సిలర్లు దారా రవి, పాలేటి నాగార్జున పాల్గొన్నారు.

ప్రాముఖ్యతా భవనాలను పూర్తి చేయండి

నాయుడుపేట: సూళ్లూరుపేట నియోజకవర్గంలో ప్రాముఖ్యతా భవనాలు సచివాలయం, వెల్‌నెస్ సెంటర్, బల్క్‌మిల్క్ సెంటర్‌లను త్వరితగతిన పూర్తి చేయించేలా చూడాలని పంచాయతీ రాజ్ అధికారులను ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆదేశించారు. నాయుడుపేట ఆర్అండ్‌బీ అతిథిగృహంలో శనివారం పంచాయతీ రాజ్ అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షలోఎమ్మెల్యే పలు సూచనలు అందించారు. నియోజకవర్గంలోని మండలాల్లో భవన నిర్మాణాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించాలన్నారు. నాడునేడు, ప్రభుత్వ ఆస్పత్రుల భవనాలను త్వరితగతిన పూర్తిచేసి నాణ్యతలు పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మధ్యాహ్నం 3గంటలకు మండల అభివృద్ధి, పంచాయతీ రాజ్ శాఖల అధికారులతో సమీక్షించారు. పంచాయతీరాజ్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్ గిరినాథ్, పీఆర్ డీఈ రమణయ్య, ఎంపీడీఓ శివప్రసాద్, ఏఈ వెంకటేశ్వర్లు, ఎస్ వెంకటేశ్వర్లు, ఏపీఓలు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం



నవరత్నాల సూచిక నమూనాను పరిశీలిస్తున్న నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి

- నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి



లబ్ధిదారులకు బుక్‌లెట్ అందజేస్తున్న నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి

డక్కిలి: రాష్ట్ర ప్రభుత్వం ప్రజాసంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయ కర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని వడ్ల మోపూరు సచివాలయ పరిధిలో నడింపల్లి, దందవోలు పంచాయతీల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని రెండో రోజూ ఆయన నిర్వహించారు. ముందుగా నడింపల్లి, దందవోలుకు విచ్చేసిన ఆయనకు వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరించి లబ్ధిదారులకు బుక్‌లెట్‌లను అందజేశారు. రాంకుమార్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుస్తున్నట్లు తెలిపారు. అధికారులతో కలిసి ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. వెంకటగిరి నియోజకవర్గ ప్రజలకు సేవ చేయడంలో ముందుంటానని తెలిపారు. అన్ని గ్రామాలను అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తున్నానని చెప్పారు. గత ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. నడింపల్లి, దందవోలులో ప్రజా సమస్యలు తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరించేందుకు అధికారులను ఆదేశించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించే సమయంలో అన్ని శాఖల అధికారులు తప్పకుండా అందుబాటులో ఉండాలని నేదురుమల్లి తెలిపారు. కార్యకమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కలిమిలి రాజేశ్వరి, ఎంపీపీ గోను రాజశేఖర్, జేసీఎస్ మండల ఇన్‌చార్జి చింతల శ్రీనివాసులురెడ్డి, మండల ఉపాధ్యక్షుడు గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి, నడింపల్లి సర్పంచ్ ఏయం రత్నం, నేతలు సిద్దయ్యనాయుడు, పిల్లి రామసుబ్బారెడ్డి, ఆదిరెడ్డి మల్లికార్జునరెడ్డి, బి.మస్తాన్‌రెడ్డి, లింగసముద్రం ఎంపీటీసీ సభ్యుడు నావూరు కోటేశ్వరయ్యపాల్గొన్నారు.

బాలికలు ఆత్మవిశ్వాసంతో అడుగులు వేయాలి



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి అనూష

వెంకటగిరి: బాలికలు సమాజంలో ఎదురవుతున్న సమస్యలను ప్రశ్నించి, పరిష్కారం కోసం ఆత్మవిశ్వాసంతో ముందుకు అడుగులు వేయాలని వెంకటగిరి జూనియర్ సివిల్ జడ్జి ఓ. అనూష తెలిపారు. స్థానిక సాంఘిక సంక్షేమశాఖ బాలికల వసతి గృహంలో శనివారం మండల న్యాయ సేవాధికారసంస్థ ఆధ్వర్యంలో బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ పట్టువిడవకుండా చేసే ప్రయత్నం చివరికి విజయాన్ని చేకూర్చుతుందన్నారు. విద్యతోనే ఉన్నత స్థితికి చేరుకోగలరని, దానిని సాధించేందుకు నిరంతరం శ్రమించాలన్నారు. కుటుంబంలో మహిళ పాత్ర ఎంత కీలకమయిందో.. సమాజంలో కూడా అంతే కీలకమన్నారు. మహిళలు ఇప్పుడు అడుగుపెట్టని రంగం లేదని గుర్తించాలన్నారు. ధైర్యంగా సమస్యలను సంబంధిత అధికారులు దృష్టికి తీసుకెళ్లాలని లేదా కోర్టులో కాగితంపై రాసి ఇచ్చినా స్పందించి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. వసతిగృహంలో ఉన్న టాయిలెట్‌ల సమస్యను విద్యార్థులు జడ్జి అనూష దృష్టికి తీసుకురావడంతో మున్సిపల్ కమిషనర్‌తో చర్చించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. లోక్‌అదాలత్ సభ్యులు సుంకరరాజేష్, ఆర్ముగం, న్యాయవాదులు డి.రాజారావు, సీహెచ్ భావన, ఎన్.అనుపమ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

కలువాయి: సబ్‌స్టేషన్, 33 కేవీ విద్యుత్‌లేన్ల నిర్వహణ పనుల నిమిత్తం ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని కలువాయి ఇన్‌చార్జ్ ఏఈ యశ్వంత్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

సేవలకు ఉత్తమ పురస్కారం



డీఎంఅండ్ హెచ్ఓ పెంచలయ్య నుంచి పురస్కారాన్ని అందుకుంటున్న డాక్టర్ హరిప్రసాద్

గూడూరు: పట్టణంలోని సిద్దూ అలర్జీ ఊపిరితిత్తుల వైద్యులు హరిప్రసాద్ ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకున్నారు. ప్రపంచ టీబీ దినోత్సవం సందర్భంగా ఈ మేరకు ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి పెంచలయ్య చేతులమీదుగా శుక్రవారం ఈ పురస్కారాన్ని అందుకున్నారు. టీబీ వ్యాధి నివారణకు తనవంతుగా 23 ఏళ్లుగా 200పైగా ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించి, టీబీ వ్యాధి నివారణకు కృషి చేసినందుకుగాను తనకు 5వ పర్యాయం ఈ పురస్కారం అందుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

మహిళల అభ్యున్నతే జగనన్న లక్ష్యం



సీఎం సందేశాన్ని వీక్షిస్తున్న మహిళలు

సైదాపురం: మహిళల అభివృద్ధే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని జెడ్పీటీసీ సభ్యుడు చిత్తలూరు పోలయ్య అన్నారు. స్థానిక ఐకేపీ కార్యాలయంలో శనివారం ఏపీఎం రాధమ్మ అధ్యక్షతన వైఎస్సార్ ఆసరా మూడో విడత కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మూడో విడతలో మండలంలో 741 పొదుపు గ్రూపులకు రూ.5 కోట్ల 20లక్షలు ప్రభుత్వం మహిళల ఖాతాల్లో జమ చేసిందని అన్నారు. సర్పంచ్ శారద, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, నేతలు పెంచలయ్య పాల్గొన్నారు.

621 గ్రూపులకు రూ.4.80 కోట్ల లబ్ధి

ఓజిలి: మండలంలోని డ్వాక్రా సంఘాలకు వైఎస్సార్ ఆసరా పథకంలో మూడవ విడత రూ.4.80 కోట్లు లబ్ధిదారుల ఖాతాలో జమ అయినట్లు ఏపీఎం నిర్మలమ్మ శనివారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఏల్లూరు జిల్లా దెందలూరులో మూడవ విడత ఆసరా పథకం విడుదల సందర్భంగా పొదుపు మహిళలతో టీవీలో సీఎం ప్రసంగాన్ని వీక్షించారు. ఓజిలి మండలంలో 621 సంఘాలకు గాను 5,877 మంది లబ్ధిదారులకు రూ.4.80 కోట్లతో లబ్ధిచేకూరిందని తెలిపింది. ఈనెల 28న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య చేతులమీదుగా పొదుపు సభ్యులకు చెక్కులు పంపిణీ చేస్తామని తెలిపారు.

ఎన్‌బీకేఆర్‌లో సాంకేతిక సదస్సు

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో శనివారం మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో మెక్స్‌పెడియా–2023 సాంకేతిక సదస్సు జరిగింది. ఈ సదస్సుకు పలు రాష్ట్రాల నుంచి ఇంజినీరింగ్ విద్యార్థులు హాజరయ్యారు. పేపర్ ప్రెజెంటేషన్, క్విజ్, ప్రాజెక్ట్ ప్రెజెంటేషన్ విభాగాల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు తమ నమూనాలను ప్రదర్శించారు. ఉత్తమ ప్రెజెంటేషన్‌లకు కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి బహుమతి ప్రదానం చేశారు. మెకానికల్ విభాగం హెచ్ఓడీ విక్రమ్‌కుమార్, ప్రోగ్రాం కన్వీనర్ అశోక్ కుమార్‌రెడ్డి, అమర్‌బాబు పాల్గొన్నారు.

ఏకొల్లు సర్పంచ్‌కు అవార్డు



ఢిల్లీలో అవార్డు అందుకుంటున్న సర్పంచ్ బ్లెస్సీ

దొరవారిసత్రం: ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వ సంస్థ అయిన బాలల హక్కుల రక్షణకు ఢిల్లీ కమిషన్ బాలల హక్కుల చాంపియన్ అవార్డు(2022–23)కు దొరవారిసత్రం మండలం ఏకొల్లు పంచాయతీ సర్పంచ్ ఆవల బ్లెస్సీ ఎంపికయ్యారు. అవార్డును శనివారం ఢిల్లీలో కమిషనర్ చేతుల మీదుగా ప్రసంసాపత్రాన్ని, రూ.75వేల ప్రోత్సాహక బహుమతిని ఆమె అందుకుంది. అవార్డు గ్రహీతకు ఎంపీడీఓ సింగయ్య, తహసీల్దార్ గోపినాథ్‌రెడ్డి అభినందనలు తెలిపారు.

శతకపద్యరత్న పురస్కారాల ప్రదానం



పురస్కార గ్రహీతలతో నిర్వాహకులు

వెంకటగిరి: ప్రణతి సాహితీ సామాజిక సేవాసంస్థ ఆధ్వర్యంలో వంద పద్యాలను అనర్గళంగా చెప్పిన 40 మంది బాలబాలికలకు శత శతకపద్యరత్న పురస్కారాలను అందజేశారు. శనివారం పట్టణంలోని ఓ ప్రైవేట్ కల్యాణమండపంలో నిర్వహించిన కార్యక్రమంలో వేదసంస్కృతి కళాపీఠం ప్రతినిధులు లలిత,కృష్ణ మాట్లాడుతూ శ్రీరాముని వంశ చరిత్రలోని పేర్లు, శతక పద్యాలు వల్లించడం అభినందనీయమన్నారు. అలాగే ఆర్చరీలో ప్రతిభను చాటిన 49 మందికి ప్రత్యేక పురష్కారాలు అందించారు. చరిత్రకారుడు గురుజాల నాగరాజశెట్టి, ఏపీపీ కేజే ప్రకృతికుమార్, సత్యసాయి బాలవికాస్ కో–ఆర్డినేటర్ లీలారాణి, ప్రణతి సంస్థ సభ్యులు సుంకరరవి, నర్రా రవి, రాజేశ్వరి, సరస్వతమ్మ, మల్లయ్య, రామిశెట్టి కవిత పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్సీ మేరిగకు అభినందన సభ

రాపూరు: నూతనంగా ఎంపికైన ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌కు ఆదివారం రాపూరులో పాపకన్ను మధుసూదన్‌రెడ్డి, పాపకన్ను దయాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో అభినందనసభ, సన్మానం నిర్వహించనున్నట్లు జేసీఎస్ కన్వీనర్ దందోలు నారాయణరెడ్డి తెలిపారు. స్థానిక సీవీకే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అభినంద సభ జరుగుతుందని ఆయన చెప్పారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



హాస్టల్‌ను తనిఖీ చేస్తున్న న్యాయమూర్తి సుల్తానాబేగం

గూడూరు: ప్రతిఒక్కరూ బాగా చదివి జీవితంలో ఉన్నతంగా ఎదగాలని, అలాగే చట్టాలపై కూడా అవగాహన పెంచుకోవాలని 7వ అదనపు జిల్లా జడ్జి షమ్మీ పర్వీన్ సుల్తానా బేగం పేర్కొన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు హాస్టళ్ల తనిఖీల్లో భాగంగా మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని డీఆర్‌డబ్ల్యూ కళాశాలను, హాస్టల్‌ను ఆమె శనివారం తనిఖీ చేశారు. హాస్టల్‌లోని వసతులను ఆమె అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ చదువుతోనే ఉన్నత శిఖరాలను అధిరోహించగలమని తెలిపారు. చిన్నప్పటి నుంచే చట్టాలపై కూడా అవగాహన కలిగి, సుఖమయ జీవనాన్ని సాగించాలని ఆమె తెలిపారు. న్యాయమూర్తి వెంట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమాశంకర్, ప్రిన్సిపల్ హనుమంతరావు, న్యాయవాదులు మహబూబ్ బాషా, పీఎల్‌వీ రామసుబ్బయ్య పాల్గొన్నారు.

దరఖాస్తుకు గడువు పెంపు

రాపూరు: రాపూరు మండలం కండలేరు జలాశయం వద్దగల డాక్టర్ అంబేడ్కర్ బాలికల గురుకులంలో ప్రవేశ దరఖాస్తుకు గడువు పెంచినట్లు శనివారం గురుకుల ప్రిన్సిపాల్ భారతి తెలిపారు. ఆమె మాట్లాడుతూ బాలికల గురుకులంలో 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో చేరదలిచిన విద్యార్థినులు ఆన్‌లైన్‌లో 31వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



చింతవరంలో గర్భిణులకు అవగాహన



కేసవరం అంగన్‌వాడీ కేంద్రంలో..



గిలకపాడులో..



డక్కిలిలో..



మాట్లాడుతున్న సీడీపీఓ జ్యోతినాయక్

చిల్లకూరు: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల ఎత్తు, బరువు తగ్గకుండా ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. గూడూరు రూరల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని చిల్లకూరు, చింతవరం సెక్టార్లలో శనివారం పోషణ్ పక్వాడాపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. చిన్నారుల ఎత్తు బరువులను సరి చూశారు. సూపర్‌వైజర్లు శివజ్యోతి, రేణుక పాల్గొన్నారు.

పోషకాహారంతో రక్తహీనత తగ్గుతుంది

కోట: గర్భవతులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందజేసే పౌష్టికాహారాన్ని తీసుకోవడం ద్వారా రక్తహీనత అరికట్టవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత సూచించారు. పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా కేసవరం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం గర్భవతులు, బాలింతలకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు షర్మిల, ప్రసన్న పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం

రాపూరు: పోషకాహారంతో ఆరోగ్యంగా ఉండవచ్చని, దీనిని క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శారద పేర్కొన్నారు. గిలకపాడులో శనివారం పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా గర్భవతులు, బాలింతలు తీసుకోవలసిన ఆహారంపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు కవిత, అంకమ్మ, బుజ్జమ్మ, మంజుల పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన కల్పించాలి

డక్కిలి: పోషకాహారంపై క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలని జెడ్పీటీసీ కలిమిలి రాజేశ్వరి, ఎంపీపీ గోను రాజశేఖర్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా శనివారం అంగన్‌వాడీ కార్యకర్తలకు, హెల్పర్‌లకు అవగాహన సదస్సు నిర్వహించారు. జెడ్పీటీసీ, ఎంపీపీ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంగన్‌వాడీ కేంద్రాలను మరింత అభివృద్ధి చేసేందుకు నాడు–నేడు పథకం కింద రూపు రేఖలు మార్చుతున్నట్లు చెప్పారు. పోషణ్ పక్వాడా ఉద్దేశం మంచి ఆహారపు అలవాట్లతో పాటు పోషక విలువలు ఉన్న ఆహారాన్ని తీసుకోవడమేనన్నారు. ఎంపీడీఓ కోటేశ్వరరావు, వెంకటగిరి ఐసీడీఎస్ సీడీపీఓ షంషాద్‌బేగం, ఎంఈఓ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్ కల్పలత పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే చిన్నారులకు ఆరోగ్యం

ఓజిలి: పౌష్టికాహారంతో చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీఓ జ్యోతినాయక్ అన్నారు. మండల శ్రీశక్తిభవనంలో పోషన్ పక్వాడా కార్యక్రమంపై అంగన్‌వాడీ సిబ్బందితో శనివారం సమావేశం నిర్వహించారు. గర్భవతులు, బాలింతలకు ఆరోగ్యసలహాలను సూచించారు తహసీల్దార్ లాజరస్, ఎంపీడీఓ రజనీకాంత్, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ సిరాజ్‌బాషా, సూపర్‌వైజర్ మణెమ్మ పాల్గొన్నారు.

పచ్చిశనగ కొనుగోలు కేంద్రం ప్రారంభం



ప్రారంభోత్సవంలో అధికారులు

కలువాయి: వెరుబొట్లపల్లి ఆర్‌బీకేలో పచ్చిశనగ కొనుగోలు కేంద్రాన్ని శనివారం అధికారులతో కలిసి జెడ్పీటీసీ సభ్యులు బి.అనిల్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. మార్క్‌ఫెడ్, నాఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో రైతుల నుంచి పచ్చిశనగలు క్వింటాలుకు కనీస మద్దతు ధర రూ.5,335కు కొనుగోలు చేస్తామని మార్క్‌ఫెడ్ డీఎం ఎస్.పవన్‌కుమార్ తెలిపారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యులు బి.అనిల్‌కుమార్ రెడ్డి అన్నారు. ఎంపీపీ ఆర్.లక్ష్మీదేవి, ఉపాధ్యక్షుడు పి.పెంచలనరసారెడ్డి, గ్రామ సర్పంచ్ జి.రమణమ్మ, మండల ప్రత్యేకాధికారి అనితకుమారి, ఏఈఓ అనిత, వీఏఏలు చెంచయ్య, శివకిశోర్ పాల్గొన్నారు.

ముగిసిన కుంభాభిషేక వేడుకలు



కలశాలతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు

నాయుడుపేటటౌన్: బిరదవాడ గ్రామంలో నూతనంగా నిర్మాణం చేపట్టిన కల్యాణ వేంకటేశ్వర స్వామి కుంభాభిషేక ముగింపు వేడుకలను శనివారం వైభవంగా నిర్వహించారు. ఇందులో శనివారం ఆలయం వద్ద కలశ ఆరాధన, యోగబలి, పూర్ణాహుతి కలశ శోధన పూజలు జరిపారు. భక్తులు, స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు కలిసి కలశాలలో అభిషేక జలాలను ఆలయం వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అర్చకులు కలశోద్వాశన పూజలను జరిపి పవిత్ర జలాలను భక్తులపై చల్లారు.

అన్నపై తమ్ముడు కత్తితో దాడి

నాయుడుపేటటౌన్: అన్నపై వరుసకు తమ్ముడైన వ్యక్తి కత్తితో దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన నాయుడుపేటలోని గడియారం సెంటర్ సమీపంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరక.. పెళ్లకూరు మండలం రోసనూరు రాజుపాళెం గ్రామానికి చెందిన పల్లిపాటి వెంకటేశ్వర్లుకు చిన్నాన్న కుమారుడైన పల్లిపాటి వెంకటేష్ రూ.10 వేలు నగదు అప్పుగా తీసిచ్చాడు. అయితే అప్పు చెల్లించాలని ఒత్తిడి పెట్టడంతో వెంకటేష్‌ను వెంకటేశ్వర్లు దూషించాడు. ఈక్రమంలో అన్న వెంకటేశ్వర్లుపై కక్ష కట్టిన వెంకటేష్ కత్తితో వెంకటేశ్వర్లును గడియారం సెంటర్ సమీపంలో కత్తితో దాడి చేశాడు. వెంకటేశ్వర్లు చాతిపై రెండు చోట్ల గాట్లు పడ్డాయి. విషయం తెలిసి సీఐ సీహెచ్ ప్రభాకర్ రావు, ఎస్ఐ శ్రీకాంత్ బాధితుడిని ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.